సాక్షి విశాఖపట్నం

సోమవారం । 7 । జూలై । 2025



చదరంగం పోటీల విజేతలు కృష్ణ, దివ్య 8లో



గిరి ప్రదక్షిణకు ట్రాఫిక్ ఆంక్షలు 8లో



ప్రేమతో.. టీకా! 8లో

న్యూస్‌రీల్

వైఎస్సార్ జయంతి రోజున సేవా కార్యక్రమాలు చేయండి



సాక్షి, విశాఖపట్నం: మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను ఈ నెల 8వ తేదీన ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు పిలుపునిచ్చారు. వైఎస్సార్ పుట్టినరోజున వాడవాడలా సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రక్తదాన శిబిరాలు, పుస్తకాల వంపిణీ, పేదలకు అన్నదానం, దుస్తుల పంపిణీ, ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ వంటి సేవాకార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ సేవాదళ్, యువజన విభాగం, విద్యార్థి విభాగం అధ్యక్షులు సేవాకార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వైఎస్సార్ సీపీ యువతంతా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని సూచించారు.

అప్పన్నకు 17.5 గ్రాముల బంగారు పుష్పం



బంగారు పుష్పం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి అనకాపల్లి మండలం సిరిసపల్లి గ్రామానికి చెందిన అలవరపు త్రిమూర్తులు 17.5 గ్రాముల బంగారు పుష్పాన్ని కానుకగా ఆదివారం అందించారు. సింహగిరికి వచ్చిన దాత ఆ బంగారు పుష్పాన్ని దేవస్థానం ఈవో వి.త్రినాథరావుకి ఇచ్చారు. దేవస్థానం తరఫున దాతకు ఈవో రశీదు అందించారు. దాతకు స్వామివారి దర్శనం కల్పించి శేషవస్త్రం, ప్రసాదం, ఆశీర్వచనం అందజేశారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

మహారాణిపేట: కలెక్టరేట్‌లో సోమవారం యథావిధిగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం.ఎస్.హరేందిర ప్రసాద్ తెలిపారు. అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. అలాగే కాల్ సెంటర్ 1100ను సంప్రదించి కూడా ప్రజలు వినతులను నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

సౌత్ సబ్ డివిజన్ ఏసీపీ త్రినాథ్ బదిలీ

అల్లిపురం: సౌత్ సబ్ డివిజన్ ఏసీపీ టి.త్రినాథ్ బదిలీ అయ్యారు. ఈ మేరకు పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. మంగళగిరి పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. హార్బర్ ఏసీపీని ఇన్‌చార్జిగా నియమించి, తక్షణమే ఏసీపీ త్రినాథ్‌ను రిలీవ్ చేయాలని జోన్–2 శాంతిభద్రతల డీసీపీని ఆదేశించారు. ఆయన 2002 నుంచి ఇక్కడ ఏసీపీగా పనిచేస్తున్నారు.

క్వార్టర్లు తీసుకోకుంటే హెచ్ఆర్ఏ లేదు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కేటాయించిన క్వార్టర్లు తీసుకోకపోతే వారు హెచ్ఆర్ఏకు అర్హులు కారని ఉక్కు యాజమాన్యం తెలిపింది. ఈ మేరకు శనివారం అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. కంపెనీకి ఉన్న వనరులను గరిష్ఠంగా ఉపయోగించుకునే ప్రక్రియలో కంపెనీ ఆర్థిక పరిస్థితి దృష్టిలో ఉంచుకుని అర్హత కలిగిన అధికారులందరికీ క్వార్టర్లు కేటాయిస్తామన్నారు. ఈడీ బంగళాల కేటాయింపులో ఈ–8 అధికారులను పరిగణలోకి తీసుకుంటామని పేర్కొన్నారు.

రోటరీ క్లబ్ సౌత్ ప్రెసిడెంట్‌గా శివకుమార్‌రెడ్డి



నూతన కార్యవర్గం

బీచ్‌రోడ్డు: రోటరీ క్లబ్ విశాఖపట్నం సౌత్ ప్రెసిడెంట్‌గా వి.శివకుమార్ రెడ్డి నియమితులయ్యారు. నగరంలో ఆదివారం జరిగిన ప్రమాణ స్వీకారోత్సవంలో నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించింది. ఎగ్జిక్యూటివ్ సెక్రటరీగా ఆర్‌వీ రాజశేఖర్, ట్రెజరర్‌గా పి.ప్రభాకర్, ఇతర విభాగాల ప్రతినిధులను ప్రకటించారు. ముఖ్యఅతిథి ఆచార్య వి.సుబ్రమణ్యం మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు చేయూతనిచ్చేందుకు రోటరీ క్లబ్ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆచార్య కె.తిమ్మారెడ్డి, క్లబ్ పూర్వ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఛాయాదేవి, నూతన అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి క్లబ్ భవిష్యత్ కార్యాచరణను వివరించారు. గాజువాక చెట్టివానిపాలెం పాఠశాలలో విద్యార్థులకు ప్రతి శుక్రవారం ఫ్రూట్స్, గర్భిణులకు నెలకోసారి పౌష్టికాహారాన్ని తమ క్లబ్ ద్వారా అందిస్తామన్నారు.

మున్నా భాయ్ ఎవరో?



- ఢిల్లీ నుంచి 25 గ్రాముల కొకైన్ విశాఖకు తీసుకొచ్చిన నిందితులు
- ఇంత పెద్ద మొత్తంలో డ్రగ్స్ దొరకడం నగరంలో ఇదే తొలిసారి
- బయటకు పొక్కనివ్వకూడదంటూ కూటమి నేతల ఫోన్లు
- మున్నాతో టీడీపీ నేతలకు సంబంధాలున్నట్లుగా గుర్తింపు
- తెర వెనుక పేర్లు బయటపడనీయకుండా కూటమి నేతల ఒత్తిళ్లు
- డ్రగ్స్ దొరికినా నోరు మెదపని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

సాక్షి, విశాఖపట్నం : నగరంలో డ్రగ్స్ రవాణా వెనుక పెద్ద తలలే ఉన్నట్లు తెలుస్తోంది. కూటమి నేతల వారసులే మత్తు పదార్థాల సూత్రధారులనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దొరికిన వారే దొంగలన్నట్లుగా చిత్రీకరించి.. డ్రగ్స్ రవాణా వెనుక ఎవరి హస్తం ఉందన్న అంశాలను కూటమి నేతలు తొక్కిపెట్టేందుకు తెరవెనుక ప్రయత్నాలు జోరుగా చేస్తున్నారు. ఉత్తరాంధ్రకు చెందిన ఓ టీడీపీ ఎంపీ పోలీసులపై ఒత్తిళ్లు తీసుకొస్తున్నారని తెలుస్తోంది. కీలక సూత్రధారిగా ఉన్న అక్షయ్‌కుమార్ అలియాస్ మున్నా కాల్ రికార్డులను పరిశీలించిన పోలీసులు అతడికి కొంతమంది కూటమి నేతలతో సంబంధాలున్నట్లుగా గుర్తించినట్లు సమాచారం. సెంట్రల్ ఏజెన్సీ సమాచారంతో డ్రగ్ పెడ్లర్స్‌పై దాడులు నిర్వహించిన త్రీ టౌన్ పోలీసులు రెండురోజుల క్రితం నగర చరిత్రలోనే భారీ మొత్తంలో డ్రగ్స్‌ను పట్టుకున్నారు. 25 గ్రాముల కొకైన్‌తోపాటు రూ.3.5 లక్షల నగదు, కారు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ రాకెట్‌ను ఛేదించిన కొద్ది గంటల వ్యవధిలోనే పోలీసులకు కూటమి నేతల నుంచి ఫోన్లు రావడం మొదలయ్యాయి. అప్పటికే డ్రగ్స్ పట్టుకున్నట్లు బయటకు తెలియడంతో పోలీసులు వివరాలు వెల్లడించారు. అయినా కూటమి నేతల నుంచి ఒత్తిళ్లు ఆగకపోవడంతో పోలీసులు మల్లగుల్లాలు పడుతున్నారు.

డ్రగ్స్ వచ్చిన గంటలోనే ఓ నేతకు ఫోన్

దక్షిణాఫ్రికాకు చెందిన థామస్‌తోపాటు విశాఖకు చెందిన అక్షయ్ కుమార్ అలియాస్ మున్నా ఇందులో కీలకంగా వ్యవహరించారు. డ్రగ్స్‌ని ఢిల్లీ నుంచి విశాఖకు తీసుకొచ్చిన గంట వ్యవధిలోనే ఉత్తరాంధ్రకు చెందిన ఓ నాయకుడికి ఫోన్ కాల్ వెళ్లినట్లు పోలీసులు గుర్తించారని తెలుస్తోంది. మున్నా ఫోన్‌లో కాంటాక్ట్ లిస్ట్‌లోనూ, కాల్ లిస్ట్‌లోనూ ఓ ఎంపీ ఫోన్ నంబర్‌తో పాటు టీడీపీ నేతలు, వారి వారసుల ఫోన్ నంబర్లు ఉన్నట్లు సమాచారం. అరెస్ట్ చేసిన ఐదుగుర్ని విచారించిన పోలీసులు.. వారి వద్ద నుంచి మరో ముగ్గురు పేర్లు రాబట్టారు. ఈ ముగ్గురికీ రాజకీయ నేతలతో సత్సంబంధాలు ఉండటం, ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కావడం విశేషం. వారిని పోలీస్ స్టేషన్ తీసుకొచ్చిన క్షణాల వ్యవధిలోనే కూటమి నేతల నుంచి పోలీసులకు ఫోన్ల మీద ఫోన్లు వచ్చేశాయని తెలుస్తోంది. దీంతో పోలీసులు తాము తీసుకొచ్చిన ముగ్గుర్నీ కేవలం 10 నిమిషాల్లోనే బయటకు పంపించేశారని సమాచారం. తేనె తుట్టె కదిపితే.. కూటమి నేతలు, వారి వారసుల పేర్లు డ్రగ్స్ రాకెట్‌లో బట్టబయలయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో.. విచారణ ముందుకు జరగకుండా అడ్డుపడుతున్నట్లు తెలుస్తోంది. పోలీసులు ఒత్తిళ్లకు లొంగకుండా విచారిస్తే.. మున్నా వెనుక ఉన్న భాయ్ ఎవరనేది తెలిసే అవకాశం ఉన్నా.. ప్రభుత్వం మాత్రం డ్రగ్స్ కేసును తొక్కి పెట్టేందుకు చూస్తోంది.

డ్రగ్స్ కేసులో వైద్యుడి అరెస్టు

ఈ కేసులో ఇప్పటికే ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు ఆదివారం కూర్మన్నపాలేనికి చెందిన వైద్యుడు శ్రీకృష్ణచైతన్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతడు డ్రగ్స్ కోసం అక్షయ్ కుమార్‌కు రూ.65 వేలు చెల్లించినట్లు విచారణలో పేర్కొన్నాడు. అతడికి వైద్య పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ వచ్చినట్లు పోలీసులు తెలిపారు.

ప్రశ్నించే పవన్.. ఏమయ్యారు..?

'నార్కోటిక్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్ మారుతోంది. గంజాయికి నిలయంగా ఏపీ తయారైంది. ఏ రాష్ట్రంలో గంజాయి దొరికినా.. ఏపీ నుంచి.. ముఖ్యంగా విశాఖపట్నం నుంచి వెళ్తోంది. రాష్ట్రాన్ని గంజాయి హబ్‌గా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మార్చేసింది'

- ప్రతిపక్షంలో ఉన్న సమయంలో చీమ చిటుక్కుమంటే చాలు ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇదిగో ఇలా ట్వీట్స్‌తో సోషల్‌మీడియాలో రెచ్చిపోయేవారు.
- కట్ చేస్తే.. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత గంజాయి కేసులు పెరుగుతూ వస్తున్నాయి. రాష్ట్రంలో ఎటు చూసినా గంజాయి పట్టుబడుతోంది. విశాఖలో వరుసగా డ్రగ్స్ దొరుకుతున్నాయి. ఇంత జరుగుతున్నా పవన్ కల్యాణ్ మాత్రం మౌనముని అవతారమెత్తేశారు. ఏమీ జరగనట్లు తనకేమీ తెలియనట్లుగా నిద్ర నటిస్తున్నారు.



గతంలో పవన్ కల్యాణ్ చేసిన ట్వీట్లు

శేషపాన్పుపై జగన్నాథస్వామి

- ముగిసిన దశావతారాలు
- నేడు తిరుగు రథయాత్ర



శేషపాన్పుపై భక్తులకు దర్శనమిస్తున్న జగన్నాథస్వామి

డాబాగార్డెన్స్: టర్నర్ చౌల్ట్రీలో కొలువైన జగన్నాథ స్వామి ఆదివారం శేషపాన్పుపై భక్తులకు దర్శనమిచ్చారు. తొలి ఏకాదశి, దశావతారాలు చివరి రోజు కావడంతో బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథ స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పాణంగిపల్లి జగన్నాథాచార్యులు, పాణంగిపల్లి రంగనాథాచార్యులు, పాణంగిపల్లి కేశవాచార్యులు, యేడిద సురేషుబాబు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ ఈవో టి.రాజగోపాల్‌రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు. కాగా.. స్వామి తిరుగుయాత్ర సోమవారం నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు. సాయంత్రం 5.10 గంటలకు తిరుగుయాత్ర ప్రారంభమవుతుందని, టర్నర్ సత్రం నుంచి మేళతాళాలు, బాణసంచాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి తిరిగి ప్రధాన ఆలయానికి చేరుకుంటారని వెల్లడించారు.

నిషేధిత మందులు యథేచ్ఛగా అమ్మకాలు



- వయాగ్రా, అబార్షన్, మత్తు మందుల కిట్ల విక్రయం
- జోరుగా కాలం చెల్లిన మందుల అమ్మకాలు
- కొన్ని మందుల షాపులు, ఏజెన్సీల్లో అక్రమాలు
- దాడులు చేస్తున్నా పట్టించుకోని మెడికల్ మాఫియా

మహారాణిపేట: స్మార్ట్ సిటీ విశాఖలో నిషేధిత మందుల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు మందులు, ఇంజక్షన్లు, గర్భస్రావ కిట్లు, లైంగిక సామర్థ్యం పెంచే వయాగ్రా వంటి ఔషధాలను విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. కొన్ని మెడికల్ షాపులు, ఏజెన్సీలు అక్రమాలకు అడ్డాగా మారాయి. అధికారుల పర్యవేక్షణ లోపం, మామూళ్ల ఆరోపణల నడుమ 'మెడికల్ మాఫియా' తన కార్యకలాపాలను యథేచ్ఛగా కొనసాగిస్తోంది. వాస్తవానికి వీటి విక్రయాలపై నిషేధం ఉన్నప్పటికీ.. ఎమ్మార్పీకి మించి అమ్మకాలు సాగిస్తుండడం గమనార్హం.

ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా సుమారు 4,500 మందుల దుకాణాలు, హోల్‌సేల్ ఏజెన్సీలు ఉన్నాయి. వీటిలో అనేక షాపులు ప్రభుత్వ నిబంధనలను గాలికి వదిలేశాయి. కనీస అర్హత కలిగిన ఫార్మసిస్టులు లేకుండా, అమ్మకపు వివరాలు నమోదు చేసే కంప్యూటర్లు, రిజిస్టర్లు లేకుండానే వ్యాపారం సాగిస్తున్నాయి. కాలం చెల్లిన మందులను సైతం విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా దగ్గు మందులు, నొప్పి నివారణ మందులు, మత్తును కలిగించే ఇంజక్షన్లను యువతకు సులభంగా విక్రయిస్తున్నారు. నగరంలో కొన్ని ప్రాంతాల్లో వయాగ్రా అమ్మకాలు అనధికారికంగా జరుగుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా నగరంలోని జిల్లా పరిషత్, రెల్లివీధి, కురుపాం మార్కెట్, కొత్త రోడ్డు, ఎంవీపీ కాలనీ, పెదవాల్తేరు వంటి ప్రాంతాలు ఈ అక్రమ దందాకు కేంద్రాలుగా మారాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వయాగ్రా, అబార్షన్ కిట్లను ఎమ్మార్పీ ధర కంటే అధిక ధరకు అమ్ముతూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు.



నగరంలోని ఓ మెడికల్ షాపులో తనిఖీలు చేస్తున్న వివిధ శాఖల అధికారులు(ఫైల్)

మొక్కుబడిగా తనిఖీలు

ఔషధ నియంత్రణ మండలి, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసులు, ఈగల్ వంటి వివిధ శాఖలు అడపాదడపా దాడులు చేస్తున్నా ఫలితం శూన్యంగానే ఉంటోంది. దాడుల తర్వాత కొద్ది రోజులకే మాఫియా మళ్లీ తమ అక్రమ వ్యాపారాన్ని యథావిధిగా ప్రారంభిస్తోంది. కొన్ని శాఖలకు మామూళ్లు అందుతుండటమే దీనికి కారణమన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఔషధ నియంత్రణ శాఖలో సిబ్బందికి వాహనాలు వంటి కనీస సౌకర్యాలు లేకపోవడంతో తనిఖీలు మొక్కుబడిగా మారుతున్నాయన్న విమర్శలున్నాయి. తనిఖీల్లో బిల్లులు లేకుండా అమ్మకాలు జరపడం, ప్రిస్క్రిప్షన్ వివరాలు నమోదు చేయకపోవడం, ఫార్మసిస్టులు అందుబాటులో లేకపోవడం వంటి అనేక ఉల్లంఘనలు బయటపడినా, చర్యలు మాత్రం నామమాత్రంగానే ఉంటున్నాయి. ఈ ఆరోపణలపై ఔషధ నియంత్రణ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ విజయ కుమార్ వద్ద ప్రస్తావించగా.. 'వయాగ్రా, అబార్షన్ కిట్ల అమ్మకాలు మా దృష్టికి రాలేదు. మేము రెగ్యులర్‌గా తనిఖీలు చేస్తున్నాం. ఒకవేళ ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు జరిపితే, వారి షాపు లైసెన్సులను తక్షణమే రద్దు చేస్తాం'అని 'సాక్షి'కి తెలిపారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, సమన్వయకర్తలు మళ్ల విజయప్రసాద్, మొల్లి అప్పారావు, పార్టీ కార్యాలయ పర్యవేక్షకుడు రవిరెడ్డి, బోని శివరామకృష్ణ తదితరులు

మహారాణిపేట: అణగారిన వర్గాల ఆశాజ్యోతి స్వర్గీయ బాబూ జగ్జీవన్‌రామ్ అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు అన్నారు. ఆదివారం మద్దిలపాలెంలో గల వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోని శివరామకృష్ణ ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద సమన్వయకర్తలు మళ్ల విజయప్రసాద్, మొల్లి అప్పారావుతో కలిసి కేకే రాజు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదుగురు ప్రధానుల వద్ద కేంద్రమంత్రిగా పని చేసి, అన్ని శాఖలకు న్యాయం చేశారని కొనియాడారు. అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ కార్యాలయం పర్యవేక్షకుడు రవిరెడ్డి, ముఖ్యనేత జహీర్ అహ్మద్, కార్పొరేటర్లు అనిల్‌కుమార్ రాజు, రెయ్యి వెంకటరమణ, బిపిన్ కుమార్ జైన్, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు పేడాడ రమణికుమారి, సనపల రవీంద్ర భరత్, పులగం కొండారెడ్డి, రామి రెడ్డి, వంకాయల మారుతీ ప్రసాద్, బోండా ఉమా మహేశ్వరరావు, మార్కేండేయులు, జిల్లా పార్టీ కమిటీ మంచా నాగమల్లేశ్వరి, ఎం.సత్యనారాయణ, పద్మ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కోరాపుట్ వరకే కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్

తాటిచెట్లపాలెం: నిర్వహణాపరమైన కారణాల వల్ల కిరండూల్ మార్గంలో నడిచే రైళ్లు ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈనెల 7వ తేదీన విశాఖపట్నం–కిరండూల్ (18515) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 8వ తేదీన కిరండూల్–విశాఖపట్నం(18516) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ తేదీల్లో కోరాపుట్–కిరండూల్ మధ్య ఈ రైళ్ల రాకపోకలు సాగించవు.

అప్పుల కుప్ప.. యోగాంధ్ర గొప్ప

- యోగాసనాలకు రూ.75 కోట్లు ఖర్చు
- ప్రభుత్వం విదిల్చింది కేవలం రూ.28 కోట్లు
- పనులు చేసిన కాంట్రాక్టర్లకు పెండింగ్‌లో బిల్లులు
- కలెక్టరేట్ చుట్టూ కాంట్రాక్టర్ల ప్రదక్షిణలు

మహారాణిపేట: యోగాంధ్ర రికార్డుల మాటెలా ఉన్నా.. అప్పుల భారం మాత్రం తలనొప్పిగా మారింది. టెంట్ల నుంచి స్నాక్స్ వరకు బిల్లుల చెల్లింపులతో అధికారుల తలబొప్పి కడుతోంది. యోగాంధ్ర పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు బిల్లుల కోసం కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తమ బిల్లులు చెల్లించాలని అధికారుల వద్ద మొరపెట్టుకుంటున్నారు. యోగాంధ్ర కార్యక్రమం పూర్తి అయి 15 రోజులు అవుతున్నా ఇంకా ఎలాంటి బిల్లులు చెల్లించలేదని వ్యాపారులు, కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు. గత నెల 21న విశాఖలో యోగా విన్యాసాల కార్యక్రమం నిర్వహించారు. ప్రధాని మోదీతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇతర ప్రముఖులతో కార్యక్రమం పూర్తయింది. దాదాపు 3 లక్షల మందితో యోగాసనాలు వేసి గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కారు. ఈ కార్యక్రమం నిర్వహణకు సుమారు రూ.75 కోట్లు ఖర్చు జరిగిందని అధికారులు చెబుతున్నారు. యోగాంధ్ర నిర్వహణకు కూటమి సర్కార్ రెండు విడతల్లో రూ.28 కోట్లు విడుదల చేసింది. మిగిలిన నిధులు విడుదల చేయాలని జిల్లా యంత్రాంగం లేఖ కూడా రాసింది.



కంపార్ట్‌మెంట్ల నిర్మాణానికి భారీగా ఖర్చు

విశాఖ ఆర్‌కె బీచ్ నుంచి భీమిలి బీచ్ వరకు మొత్తం 368 కంపార్ట్‌మెంట్లు నిర్మించారు. ఒక్కొక్క కంపార్ట్‌మెంట్‌లో 1000 మంది ఉండేలా రూపొందించారు. దీనికే బిల్లు తడిసి మోపుడయింది. అరకొర నిధులతో చేపట్టిన పలు పనులు అంచనాలు మించిపోయాయి. వీటితో పాటు స్టేజీల నిర్మాణం కూడా జరిగింది. యోగా వేడుకల్లో పాల్గొనే వారికి కేంద్ర ప్రభుత్వం మ్యాట్లు, టీ షర్ట్‌లు ఇచ్చింది. అలాగే స్నాక్స్ కూడా పంపిణీ చేశారు. దాదాపు రూ.8 నుంచి రూ.9 లక్షల వరకు స్నాక్స్, ఇతర ఆహార పదార్థాల కోసం వెచ్చించారు. అలాగే వీఐపీలు, వీవీఐపీలకు హోటళ్లలో బస, వారు తిరగడానికి కార్ల ఏర్పాటు వంటి వాటికి భారీగా ఖర్చయింది. అయితే అయిన ఖర్చులో సగానికి పైగా చెల్లింపులు జరగలేదు. ఫలితంగా ఈ పనులు చేసిన కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ఇబ్బందులు పడుతున్నారు. బిల్లుల కోసం కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

మత్స్యకారుల పాలిట దిక్సూచి ట్రాన్స్‌పాండర్

- సరిహద్దు హెచ్చరికలను అందించే అత్యాధునిక వ్యవస్థ
- జిల్లాలో 1,100 బోట్లకు అమర్చేందుకు మత్స్యశాఖ సన్నద్ధం
- ఇప్పటివరకు 634 బోట్లకు శతశాతం రాయితీతో అందజేత

మహారాణిపేట: సముద్రంలో వేట సాగిస్తున్న మత్స్యకారులు తరచుగా తుపానులు, ఇతర ప్రకృతి వైపరీత్యాల బారిన పడి ప్రమాదాలను ఎదుర్కొంటున్నారు. అలాగే సరిహద్దులు దాటి ఇతర దేశాల భద్రతా సిబ్బందికి చిక్కి జైళ్లలో మగ్గుతున్నారు. సముద్రంలో సెల్‌ఫోన్లకు సిగ్నల్స్ లేకపోవడం వల్ల తుపానుల ముప్పును గుర్తించలేకపోవడం, చిన్నపాటి తప్పిదాలతో సరిహద్దులు దాటడం వంటి సమస్యలను మత్స్యకారులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, కేంద్ర మత్స్యశాఖ మత్స్యకారుల కోసం సరికొత్త పరికరాన్ని అందుబాటులోకి తెచ్చింది. 100 శాతం సబ్సిడీతో 'ట్రాన్స్‌పాండర్' అనే దిక్సూచిని గంగపుత్రులకు అందిస్తూ, వారిని సురక్షితంగా ఉంచడానికి అభయమిస్తోంది.

బోట్లకు అమరిక

ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా సహకారంతో, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఈ అత్యాధునిక స్పేస్ టెక్నాలజీ ఆధారిత ట్రాన్స్‌పాండర్లను రూపొందించింది. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) పథకం కింద ఇది పూర్తి ఉచితంగా (100 శాతం రాయితీతో) అందిస్తున్నారు. జిల్లాలో మొత్తం 350 మోటరైజ్డ్, 760 మెకనైజ్డ్ బోట్లకు అంటే.. మొత్తంగా 1100 బోట్లకు ఈ ట్రాన్స్‌పాండర్లను అమర్చాలని మత్స్యశాఖ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ మేరకు మత్స్యకారులకు ట్రాన్స్‌పాండర్‌పై సమగ్ర అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటి వరకు 634 బోట్లలో ట్రాన్స్‌పాండర్లున్నాయి. వీటిని ఎలా వినియోగించాలనే అంశంపై ప్రతి మత్స్యకారుడికీ అవగాహన కల్పిస్తున్నారు.



బోటుకు ట్రాన్స్‌పాండర్ అమర్చుతున్న సిబ్బంది (ఇన్‌సెట్) ట్రాన్స్‌పాండర్

సమగ్ర సమాచారం అందించేలా...

సముద్రంలో వాతావరణం ఎలా ఉంది.? తుపాను హెచ్చరికలు ఏమైనా ఉన్నాయా.? అనే సమాచారం అందించేలా దీన్ని రూపొందించారు. వేటకు వెళ్లే మత్స్యకారులు కొన్ని సందర్భాల్లో ఫోన్ సిగ్నల్స్‌ను కోల్పోతారు. అటువంటి సమయంలో వారికి తుపాను సమాచారం, ఇతర ప్రమాదాల సమాచారం చేర్చాలంటే అత్యంత కష్టం. అలాంటి సమయంలో ఈ ట్రాన్స్‌పాండర్లు మత్స్యకారులకు ముందుగానే హెచ్చరికలు జారీ చేస్తుంది. తద్వారా వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లడానికి సహాయపడుతుంది. సరిహద్దులు దాటకుండా మత్స్యకారులను హెచ్చరించి, ఇతర దేశాల భద్రతా సిబ్బందికి చిక్కకుండా కాపాడుతుంది. సముద్రంలో ప్రమాదం జరిగితే శాటిలైట్ ద్వారా కోస్టుగార్డు, మత్స్యశాఖ కార్యాలయం, బోటు యజమానికి సమాచారం వెళ్తుంది. అంతేకాదు చేపల లభ్యతకు సంబంధించిన సమాచారాన్ని ఇది అందిస్తుంది. ఈ పరికరంలో రెండు భాగాలుంటాయి. ఒకటి బోటుకు, మరొకటి డ్రైవర్ వద్ద అమర్చుతారు. ఇది బ్యాటరీ సాయంతో పని చేస్తుంది. అయితే కొందరు మత్స్యకారులు వీటిని అమర్చినప్పటికీ.. స్విచ్ ఆఫ్ చేసేస్తున్నారు. ఫలితంగా ఆ బోట్లకు సందేశాలు పంపించడం ఇబ్బందవుతోంది. వేట కోసం బోటు ప్రారంభించిన వెంటనే ట్రాన్స్‌పాండర్ స్విచ్ ఆన్ చేస్తే సమాచారం అందించగలమని, ఈ విషయంలో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలంటూ ఆ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

నా ప్రియమైన శునకమా! నీ బాధ చూడలేను

టీకా వేస్తుంటే తల్లడిల్లిన యువతి



కుక్కల పట్ల మనుషులకు ఉన్న ప్రేమ వర్ణనాతీతం. ఇతర పెంపుడు జంతువుల కంటే చాలా ఇళ్లలో శునకాలకు ప్రత్యేక స్థానం ఉంటుంది. పెంపుడు కుక్కలు కుటుంబంలో ఒక సభ్యుడిలా మారిపోతున్నాయి. తమ మూగ జీవికి చిన్న ఇబ్బంది కూడా రాకుండా యజమానులు జాగ్రత్త పడుతున్నారు. వాటికి వ్యాక్సిన్లు వేసేటప్పుడు లేదా ఏవైనా వ్యాధులు వచ్చినప్పుడు అల్లాడిపోతున్నారు. అందుకు ఈ చిత్రమే నిదర్శనం. తన పెంపుడు శునకానికి వ్యాక్సిన్ వేస్తున్న సమయంలో ఒక యువతి ఆ దృశ్యాన్ని చూడలేక కళ్లు మూసుకుని తల్లడిల్లిపోయింది. ఈ చిత్రం మనుషులకు, శునకాలకు మధ్య ఉన్న అవ్యాజమైన బంధాన్ని తెలియజేస్తుంది.

ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ప్రేమతో.. టీకా!

- విశ్వసనీయ నేస్తాలకు రేబిస్ నుంచి రక్షణ
- ఉచిత రేబిస్ టీకా కార్యక్రమానికి విశేష స్పందన



డాబాగార్డెన్స్: నగరంలోని జడ్జికోర్టు సమీపంలోని ప్రభుత్వ పశువైద్య శాల ప్రాంగణం ఆదివారం సందడిగా కనిపించింది. విభిన్న జాతుల శునకాలు, వాటిని ప్రేమగా లాలిస్తున్న యజమానులతో ఆ ప్రాంతమంతా కళకళలాడింది. ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జీవీఎంసీ నిర్వహించిన ఉచిత యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. చిట్టి పొట్టి పప్పీల నుంచి రాజసంగా నడిచే పెద్ద శునకాల వరకు.. ఒకటా రెండా.. ఎన్నెన్నో జాతులు, వర్ణాలతో ఆ ప్రాంగణం నిండిపోయింది. నగరం నలుమూలల నుంచి శునక ప్రేమికులు తమ ప్రియమైన నేస్తాలకు రేబిస్ నుంచి రక్షణ కల్పించడానికి తరలివచ్చారు. తమ వంతు కోసం ఓపికగా ఎదురుచూస్తూ.. యజమానుల మాట వింటూ, వారు చూపించే ప్రేమకు ప్రతీకగా నిలుస్తూ ఆ శునకాలు అందరినీ ఆకట్టుకున్నాయి. 'జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు వ్యాపించే ప్రమాదకరమైనవే జూనోటిక్ వ్యాధులు. రేబిస్ వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి పెంపుడు జంతువులను, తద్వారా మనల్ని మనం కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత' అని జీవీఎంసీ సిటీ వెటర్నరీ అధికారి కిశోర్ తెలిపారు. ఇందులో భాగంగానే ఈ ఉచిత టీకా శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.





టీకా వేయించేందుకు పెంపుడు శునకాలను ఆస్పత్రికి తీసుకొచ్చిన వాటి యజమానులు

ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం









7,500 రేబిస్ వ్యాక్సిన్ డోసుల పంపిణీ



చినగదిలి పశు వైద్యశాలలో కుక్కకు రేబిస్ టీకా వేస్తున్న జేడీ డాక్టర్ ఎన్.కరుణాకరరావు

ఆరిలోవ: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని అన్ని పశు వైద్యశాలల్లో ఆదివారం ఉచిత రేబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించినట్లు పశుసంవర్ధక శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. కరుణాకరరావు తెలిపారు. మొదటి రోజు జిల్లా వ్యాప్తంగా సుమారు 7,500 కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్ డోసులు వేసినట్లు వెల్లడించారు. చినగదిలి పశు వైద్యశాలలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్రమం కోసం జిల్లా మొత్తానికి 20 వేలు డోసులను సిద్ధం చేశామన్నారు. ఆదివారం అందుబాటులో లేని పెంపకందారులు సోమవారం నుంచి తమ కుక్కలను పశు వైద్యశాలలకు తీసుకెళ్లి టీకాలు వేయించుకోవాలని జేడీ సూచించారు. పెంపుడు కుక్కల యజమానులు జూనోసిస్ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మొదటి రోజు జరిగిన వ్యాక్సినేషన్ ప్రక్రియలో గోపాలపట్నం పశు వైద్యశాలలో అత్యధికంగా 800కు పైగా కుక్కలకు రేబిస్ టీకాలు వేసినట్లు జేడీ కరుణాకరరావు వెల్లడించారు.

గిరి ప్రదక్షిణకు ట్రాఫిక్ ఆంక్షలు

- ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రజలు ప్రయాణించాలి
- నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

అల్లిపురం: సింహాచలం గిరి ప్రదక్షిణ నేపథ్యంలో ఈ నెల 9వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. నగరవాసులు, భక్తుల సౌకర్యార్థం పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని, ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణించి పోలీసులకు సహకరించాలని సీపీ కోరారు.

ట్రాఫిక్ ఆంక్షలు.. ప్రత్యామ్నాయ మార్గాలు..

- 9వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 10వ తేదీ ఉదయం 6 గంటల వరకు హనుమంతువాక జంక్షన్ నుంచి అడవివరం జంక్షన్ వైపు, అడవివరం నుంచి హనుమంతువాక వైపు ఎటువంటి వాహనాలనూ అనుమతించరు. ప్రత్యామ్నాయ మార్గమైన బక్కన్నపాలెం, ఆనందపురం మీదుగా ప్రయాణించాలి.
- సత్యవరం(సత్తరువు) జంక్షన్ నుంచి అడవివరం జంక్షన్ వరకు భక్తుల వాహనాలను మాత్రమే అనుమతిస్తారు. అక్కడి నుంచి హనుమంతువాక జంక్షన్ వైపునకు ఇతర వాహనాలకు అనుమతి లేదు.
- గోపాలపట్నం పెట్రోల్ బంక్ జంక్షన్ నుంచి పాత గోశాల జంక్షన్ వైపునకు ఎటువంటి వాహనాలనూ అనుమతించరు.
- పెందుర్తి, పినగాడి మీదుగా వేపగుంట జంక్షన్ వైపునకు ఎటువంటి భారీ వాహనాలకు అనుమతి లేదు.
- ఎన్ఏడీ జంక్షన్ నుంచి గోపాలపట్నం, వేపగుంట, పెందుర్తి వైపునకు ఎటువంటి భారీ వాహనాలను అనుమతించరు.
- అనకాపల్లి నుంచి విశాఖపట్నం నగరం వైపునకు వచ్చే భారీ వాహనాలు లంకెలపాలెం జంక్షన్ వద్ద నుంచి సబ్బవరం మీదుగా ప్రయాణించాలి.
- 9వ తేదీ ఉదయం 6 గంటల నుంచి అడవివరం, గోపాలపట్నం పెట్రోల్ బంక్ మధ్య ఎటువంటి వాహనాలకు అనుమతి లేదు. ప్రత్యామ్నాయంగా దువ్వపాలెం, అక్కిరెడ్డిపాలెం, పెందుర్తి, వేపగుంట జంక్షన్ మీదుగా ప్రయాణించాలి.
- అడవివరం నుంచి గిరిప్రదక్షిణ నిమిత్తం తొలిపావంచాకు వచ్చే భక్తులు తమ వాహనాలను అడవివరం జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్‌లో నిలిపి, కాలినడకన రావి చెట్టు జంక్షన్ నుంచి గాంధీనగర్, కోనేరు మీదుగా కలశం జంక్షన్‌కు చేరుకోవాలి.
- గిరి ప్రదక్షిణ కోసం వేపగుంట, గోపాలపట్నం నుంచి వచ్చే భక్తులు సింహపురి కాలనీ వద్ద ఏర్పాటు చేసిన ఆర్టీసీకి చెందిన స్థలం, జీవీఎంసీ పార్క్, వీఎంఆర్‌డీఏ స్థలాల్లో వాహనాలను నిలిపి, కాలినడకన తొలి పావంచా వరకు చేరుకోవాలి.
- గిరిప్రదక్షిణ నిమిత్తం హనుమంతువాక వైపు నుంచి వచ్చే భక్తులు ఆదర్శనగర్, డెయిరీ ఫారం జంక్షన్, టి.ఐ.సి. పాయింట్, ఆరిలోవ చివరి బస్టాప్ మీదుగా వెళ్లి, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, డంపింగ్ యార్డ్ జంక్షన్ వద్ద వాహనాలను పార్క్ చేయాలి. అక్కడ దేవస్థానం వారు ఏర్పాటు చేసిన ఉచిత మినీ బస్సుల్లో అడవివరం న్యూ టోల్‌గేట్/పైనాపిల్ కాలనీ వరకు చేరుకోవాలి.
- అనకాపల్లి నుంచి శ్రీకాకుళం, విజయనగరం వైపు వెళ్లే ప్రైవేట్ ట్రావెల్ బస్సులు, ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనదారులను నగరంలోకి అనుమతించరు. వారు ప్రత్యామ్నాయంగా లంకెలపాలెం, సబ్బవరం, పెందుర్తి, ఆనందపురం మార్గాల్లో ప్రయాణించాలి.
- శ్రీకాకుళం, విజయనగరం వైపు నుంచి అనకాపల్లి వైపు వెళ్లే ప్రైవేట్ ట్రావెల్ బస్సులు, ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనదారులు నగరంలోకి రాకుండా ఆనందపురం, పెందుర్తి, సబ్బవరం మీదుగా అనకాపల్లి చేరుకోవాలి.
- భక్తుల రద్దీ దృష్ట్యా విశాలాక్షినగర్ బీచ్ రోడ్ జంక్షన్ నుంచి కురుపాం బీచ్ రోడ్ జంక్షన్ వరకు ఎటువంటి వాహనాలకు అనుమతి లేదు.
- హనుమంతువాక జంక్షన్, వెంకోజీపాలెం జంక్షన్ వద్ద భక్తులు రహదారి దాటుతారు. కావున వాహనదారులు సహకరించి ఆలస్యమైనా.. జాతీయ రహదారి గుండా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలి.
- జోడుగుళ్లపాలెం జంక్షన్ నుంచి హనుమంతవాక జంక్షన్ వైపు, హనుమంతవాక జంక్షన్ నుంచి జోడుగుళ్లపాలెం జంక్షన్ వైపు ఎటువంటి వాహనాలకు అనుమతి లేదు. ఆయా పరిసర ప్రాంతాల వారు విశాలాక్షి నగర్ మెయిన్ రోడ్డు గుండా ప్రయాణించి ఎస్‌బీఐ జంక్షన్ వద్ద జాతీయ రహదారిని చేరుకోవాలి.
- సీతమ్మధార, అల్లూరి సీతారామరాజు విగ్రహం జంక్షన్ నుంచి వెంకోజీపాలెం జంక్షన్ వైపునకు ఎటువంటి వాహనాలను అనుమతించరు.
- ఆరిలోవ హెల్త్ సిటీకి వెళ్లాల్సిన వారు ఆదర్శనగర్, పాత డెయిరీ ఫారం జంక్షన్ నుంచి ఆరిలోవ మీదుగా ప్రయాణించి హెల్త్ సిటీకి చేరుకోవాలి.
- వెంకోజీపాలెం జంక్షన్ నుంచి అప్పుఘర్ జంక్షన్ వైపు వెళ్లే అన్ని వాహనాలను భక్తుల రద్దీ దృష్ట్యా అనుమతించరు.
- అనకాపల్లి, రాజమండ్రి, విజయవాడ, హైదరాబాద్ వెళ్లవలసిన అన్ని ప్రైవేట్ వాహనాలు, ట్రావెల్ బస్సులు ఆనందపురం వద్ద మళ్లిస్తారు.
- ఇనార్బిట్ మాల్ దగ్గర నుంచి కైలాసపురం, ఎన్జీవోస్ కాలనీ, మాధవధార వుడా కాలనీ మీదుగా మారియట్ హోటల్ వరకు (48ఎ బస్సు రూటులో) ఎటువంటి వాహనాలనూ అనుమతించరు.
- మాధవధార జంక్షన్ నుంచి మాధవ స్వామి గుడి వరకు, ఎటువంటి వాహనాలకు అనుమతి లేదు.
- జాతీయ రహదారిపై ఎన్ఎస్‌టీఎల్ పక్కన ఉన్న 'అమ్మ వంటిల్లు' దగ్గర నుంచి కుమారి కల్యాణ మండపం వరకు ఎటువంటి వాహనాలకు అనుమతి లేదు.
- విజయనగరం, శ్రీకాకుళం వైపు నుంచి విశాఖపట్నం రైల్వేస్టేషన్‌కు, ఎయిర్‌పోర్టుకు, బస్ స్టేషన్‌కు, గాజువాక వైపు వెళ్లే అన్ని వాహనాలు ఆనందపురం నుంచి పెందుర్తి మీదుగా చేరుకోవాలి.

గిరి ప్రదక్షిణ మార్గం

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో జరిగే గిరి ప్రదక్షిణ తొలి పావంచా వద్ద ప్రారంభమవుతుంది. ఈ యాత్ర అడవివరం, హనుమంతువాక, జోడుగుళ్లపాలెం, అప్పుఘర్, వెంకోజీపాలెం, హెచ్‌బీ కాలనీ, సీతమ్మధార, బాలయ్య శాస్త్రి లేఅవుట్, పోర్ట్ స్టేడియం వెనుకవైపు, నరసింహనగర్, డీఎల్‌బీ క్వార్టర్స్, సీఐఎస్ఎఫ్ బ్యారెక్స్, ఎన్జీవోస్ కాలనీ, మురళీనగర్, మాధవధార, మారియట్ హోటల్, ఎన్ఏడీ ఫ్లైఓవర్, సుసర్ల కాలనీ, బాజీ జంక్షన్, సప్తగిరి జంక్షన్, గోపాలపట్నం బంకు జంక్షన్, కుమారి కల్యాణమండపం, ప్రహ్లాదపురం, పాత గోశాల, సింహాచలం బస్టాండ్ మీదుగా సుమారు 32 కిలోమీటర్లు ప్రయాణించి తిరిగి తొలిపావంచాకు చేరుకోవడంతో ముగుస్తుంది.

చికిత్స పొందుతూ రిమాండ్ ఖైదీ మృతి

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఒకటో పట్టణ పోలీసులు, జైల్ సూపరింటెండెంట్ ఎం.మహేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం మల్కనగిరి ప్రాంతం తెంటులిగుడ గ్రామానికి చెందిన జగేశ్వర్ హంటల్(45) గంజాయి కేసులో నిందితుడు. ఆయన గత ఏడాది నవంబరులో గంజాయి తరలిస్తుండగా అల్లూరి జిల్లా హుకుంపేట వద్ద పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో పోలీసులు గత ఏడాది నవంబరు 19న విశాఖ కేంద్ర కారాగారానికి రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి రిమాండ్‌లో ఉన్న జగేశ్వర్ హంటల్ ఆదివారం తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో జైల్ అధికారులు చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో సాయంత్రం మరణించాడు. గుండె సంబంధిత సమస్యతో మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని జైల్ అధికారులు తెలిపారు.

పేకాట స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

భీమునిపట్నం/జగదాంబ: టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం భీమిలి, కొమ్మాది ప్రాంతాల్లోని పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో భారీ మొత్తంలో నగదును స్వాధీనం చేసుకోవడంతో పాటు పలువురిని అరెస్టు చేశారు. తగరపువలస రోడ్డులోని బంతాట మైదానం ఎదురుగా ఉన్న ప్రైవేట్ అపార్ట్‌మెంట్‌లో పేకాట ఆడుతున్న ఏడుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 2.50 లక్షల స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్లను భీమిలి పోలీసులకు అప్పగించారు. అలాగే, కొమ్మాది శివారు ప్రాంతంలోని ఓ ఖాళీ ప్రదేశంలో జరుగుతున్న పేకాట స్థావరంపై కూడా పోలీసులు దాడి చేశారు. ఇక్కడ ఆరుగురిని అరెస్టు చేసి, రూ. 43,000 నగదును స్వాధీనం చేసుకున్నారు.

ఆన్‌లైన్‌లో 10 వేల నాటక పుస్తకాలు

'తెలుగు నాటక డిజిటల్ గ్రంథాలయం' వెబ్‌సైట్ ప్రారంభం



వెబ్‌సైట్‌ను ఆవిష్కరిస్తున్న మన్నం వెంకటరాయుడు, బలరామయ్య తదితరులు

సీతంపేట: నాటకం కోసం జీవితాన్ని అంకితం చేసిన బాదంగీర్ సాయి జ్ఞాపకార్థం 10 వేల నాటక పుస్తకాలను డిజిటలైజ్ చేసి, ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని విశ్రాంత ఐఏఎస్ గుమ్మళ్ల బలరామయ్య ప్రశంసించారు. రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో ఆదివారం 'తెలుగు నాటక డిజిటల్ గ్రంథాలయం' వెబ్‌సైట్ ఆవిష్కరణ సభ జరిగింది. మనసు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మన్నం వెంకటరాయుడు, అతిథులతో కలిసి ఈ వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బలరామయ్య మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు నాటకాలను అందించడానికి బాదంగీర్ సాయి స్వయంగా ఒక లైబ్రరీని నిర్వహించారన్నారు. సాయి అద్దె ఇంట్లో ఉంటూనే 10 వేల నాటకాల పుస్తకాలను సేకరించారని, ఎవరైనా నాటక పుస్తకం కావాలంటే ఆయన జిరాక్స్ తీసి ఇచ్చేవారని గుర్తు చేశారు. తన కుమార్తె సృజన జీవీఎంసీ కమిషనర్‌గా ఉన్న సమయంలో టీఎస్సార్ కాంప్లెక్స్‌లో నాటక గ్రంథాలయం ఏర్పాటు చేసినట్లు ఆయన గుర్తు చేసుకున్నారు. తెలుగు నాటకాల డిజిటలైజేషన్‌ను మొదట వెంపటి రాధాకృష్ణ ప్రారంభించారని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని మన్నం వెంకటరాయుడు సహకారంతో ఈ నాటకాలను డిజిటలైజ్ చేయడం అభినందనీయమన్నారు. రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి కృషితో ఈ వెబ్‌సైట్ ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ పుస్తక పఠనంపై ఆసక్తి తగ్గిపోతున్న ప్రస్తుత తరుణంలో నాటకాలను డిజిటలైజ్ చేసి వెబ్‌సైట్‌లో పొందుపరచడం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. డాక్టర్ మన్నం వెంకటరాయుడు మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ద్వారా ఇప్పటివరకు 40 వేల కథలను వెబ్‌సైట్‌లో ఉంచామని, ప్రతి నెలా 5 వేల మందికి పైగా వాటిని వీక్షించి చదువుతున్నారని చెప్పారు. ఇంకా 75 వేల కథలు వెబ్‌సైట్‌లో పెట్టాల్సి ఉందని వెల్లడించారు. కార్యక్రమంలో సినిమాటోగ్రాఫర్ ఎం.వి.రఘు, విశ్రాంత ఐపీఎస్ అధికారి అత్తిలి సుధాకర్, నటుడు కొల్లి మోహనరావు, మేడా మస్తాన్ రెడ్డి, వెంపటి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ నోటిఫికేషన్‌పై ఏయూ అతిథి అధ్యాపకుల ఆగ్రహం



ఏయూలో జరిగిన సమావేశంలో పాల్గొన్న అతిథి అధ్యాపకులు

మద్దిలపాలెం: ఆంధ్ర యూనివర్సిటీలో కూటమి ప్రభుత్వం సిక్స్ మెన్ కమిటీ ద్వారా సెలెక్షయి, పనిచేస్తున్న అతిథి అధ్యాపకులను కాదని, నోటిఫికేషన్ జారీ చేసి, కొత్తగా దరఖాస్తులు కోరడం అన్యాయమని అతిథి అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎం.సురేష్‌మీనన్ ఆక్షేపించారు. ఏయూలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు ఏటా రివ్యూ జరగటం సర్వసాధారణమని, కానీ కూటమి ప్రభుత్వంలోనే సెలక్షయి, ఆరు మాసాలు కాకుండానే మళ్లీ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామనడం ఆక్షేపణీయమన్నారు. కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు చేసినట్టే తమకూ రివ్యూ నిర్వహించి, మిగిలిన ఖాళీలకు కొత్త వారిని ఇంటర్వ్యూ చేయాలని కోరారు. ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్, అడ్జెస్ట్‌మెంట్ ప్రొఫెసర్, చైల్డ్ ప్రొపెషనర్లకు నెలకు రూ.80 వేలు చొప్పున జీతం చెల్లిస్తున్నా, వారికి రివ్యూ గానీ, ఇంటర్వ్యూలు గానీ లేవని, తమకు మాత్రం కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని ఆదేశించడం, ముమ్మాటికీ అణచివేతలో భాగమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్‌ను సోమవారం కలిసి, తమ తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. సమావేశంలో అతిథి అధ్యాపకులు ప్రసాద్, విక్రమ్, దాస్, గిరీష్ దేవా, రాయ్, వెంకట్, ఫణి అంబేడ్కర్, ద్రాక్షాయణి, భాను, మృత్యుంజయ, సురేంద్ర, వెంకటరమణ, రవి, ఇంజనీరింగ్ అతిథి అధ్యాపకులు పాల్గొన్నారు.

సాయంకాలం.. సాగరతీరం





ఏయూక్యాంపస్: సాయంకాలం.. సాగరతీరం.. అంటూ నగరవాసులు, సందర్శకులు ఆర్.కె. బీచ్‌కు తరలివచ్చారు. చల్లటి వాతావరణం, సముద్రపు గాలి ఆహ్లాదకరంగా ఉండటంతో ఆనందంగా గడిపారు. పిల్లలు ఇసుకలో ఆడుకుంటూ, కేరింతలు కొడుతూ సందడి చేశారు. అలల సవ్వడులు, చల్లటి గాలులు అందరినీ మైమరిపించాయి. చాలామంది సాయంత్రం వేళ అస్తమిస్తున్న సూర్యుడి అందాలను తమ కెమెరాల్లో బంధించారు. మరికొందరు బీచ్‌లో దొరికే రకరకాల స్నాక్స్‌ను తింటూ, సముద్రపు అందాలను వీక్షించారు.

- ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

చదరంగం పోటీల విజేతలు కృష్ణ, దివ్య



వినాయక్‌పై విజయం సాధించిన కృష్ణ

విశాఖ స్పోర్ట్స్: విశాఖ జిల్లా అండర్–13 చదరంగం జట్ల ఎంపిక పోటీల్లో ఓపెన్ విభాగంలో కృష్ణ వరణ్య, బాలికల విభాగంలో దివ్యదర్శిని విజేతలుగా నిలిచారు. ఈ పోటీల్లో ఓపెన్‌లో 138 మంది, బాలికల విభాగంలో 53 మంది క్రీడాకారులు పోటీపడ్డారు. ఆల్ విశాఖ చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఆదివారం విశాఖ వేలీ పాఠశాలలో ఓపెన్ విభాగంలో ఏడు రౌండ్లు, బాలికలకు ఆరు రౌండ్ల పాటు పోటీలు నిర్వహించారు. ఓపెన్ విభాగంలో కృష్ణ వరణ్య ఏడు పాయింట్లతో విజేతగా నిలవగా, శివేన్ ఆరు పాయింట్లతో నిలిచి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. బాలికల విభాగంలో దివ్యదర్శిని ఆరు పాయింట్లతో, ఆష్వీన్ ఐదు పాయింట్లతో నిలిచి జిల్లా జట్టులో స్థానం సంపాదించారు. ఓపెన్ విభాగంలో హర్ష ఆరు పాయింట్లు సాధించనప్పటికీ టైబ్రేక్స్‌లో వెనుకబడ్డాడు. జస్విన్, లక్షిత్, ఏఎఫ్ఎం ప్రియకమల, శశాంక్, ఉద్ధవ్, ఏఎఫ్ఎం వినాయక్, యోగేష్ ఐదున్నర పాయింట్లతో పోటీలను ముగించారు. రేటింగ్ ఆటగాళ్లైన అనిరుధ్ ఐదు పాయింట్లు, కల్యాణ్, వెంకట్ కీరత్, అనిష్ నాలుగున్నర పాయింట్లు మాత్రమే సాధించగలిగారు. బాలికల విభాగంలో రేటింగ్ క్రీడాకారిణులు హెమిషా, సాత్విక, ఈషా ఐదేసి పాయింట్లు సాధించినా, టైబ్రేక్స్‌లో వెనుకబడి జిల్లా జట్టుకు అర్హత సాధించలేకపోయారు. ఫిడే రేటింగ్ సత్యశ్రీ విద్య నాలుగున్నర పాయింట్లు, సమన్వి మూడు పాయింట్లతో ముగించారు. అంతర్ జిల్లాల పోటీలు ఆగస్టు 2, 3 తేదీల్లో కృష్ణా జిల్లాలో జరగనున్నాయి.

ఆకట్టుకున్న టామీ టామీ వీధి నాటిక



టామీ టామీ టామీ వీధి నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు.. ఆసక్తిగా తిలకిస్తున్న ప్రేక్షకులు

సీతంపేట: సుదర్శన్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయం ఎదుట ఆరుబయట 'టామీ టామీ టామీ' వీధి నాటిక ప్రదర్శించారు. ఉన్నత వర్గానికి, సామాన్య వర్గానికి న్యాయం ఎలా జరుగుతుందో తెలియజేసే ఇతివృత్తంతో కళాకారులు ప్రదర్శించిన ఈ నాటిక ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. కుక్కకు ఉన్న విలువ మనిషి లేదని తెలిపేలా కళాకారులు నాటిక ప్రదర్శించి రక్తి కట్టించారు. ఈ నాటికలో చలసాని కృష్ణ ప్రసాద్ హెడ్ కానిస్టేబుల్‌గా, జి.కన్నబాబు కానిస్టేబుల్‌గా, కె.శేషగిరిరావు ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా, పి.మురళీధర్ ఖాళీ కుర్రాడిగా, బి.అప్పన్నకుమార్ యువకుడిగా, వర్రె నాంచారయ్య బూతద్దాల ముసలోడిగా, ఎన్.గౌరీశ్వరరావు కోర్టు గుమాస్తాగా, చంద్రాన దుర్గాప్రసాద్, బొబ్బా ధవళేశ్వరరావు డీఎస్పీ ఆర్డర్లీగా నటించి మెప్పించారు.

చిన్నబోయిన వైకల్యం!



ఏయూ క్యాంపస్: వైకల్యం వారికి అవరోధాలు కలిగించి ఉండవచ్చు. కానీ మనోధైర్యం వారిని ముందుకు నడిపిస్తోంది. ఆదివారం బీచ్‌రోడ్డులో మనసుకు ఆనందాన్నిచ్చే ఈ దృశ్యం కనిపించింది. సాయంత్రం వేళలో పలువురు దివ్యాంగులు బీచ్‌ను సందర్శించారు. కొంత మంది ట్రై సైకిళ్లపై, మరికొందరు నడుచుకుంటూ వచ్చారు. ఎత్తుగా ఉన్న ఓ ప్రదేశంలో ట్రై సైకిల్‌పై వస్తున్న మిత్రుడిని మరొక దివ్యాంగుడైన మిత్రుడు వెనకుండి ముందుకు నెడుతూ సాయం చేశాడు. వేరొకరిపై ఆధారపడకుండా తమకు తామే సాయపడుతూ ముందుకు సాగారు. మనోధైర్యంతో సాగితే వైకల్యం కూడా చిన్నబోతుందని వీరిని చూసే ఎవరికైనా.. అనిపించక మానదు.

- ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం